# శ్రద్ధ

భగవంతుని సృష్టిలోని సమస్త జీవరాసులలో కెల్ల మానవ జన్మ ఉత్కృష్టమైనది. ఇందు ప్రతి ప్రాణి ఏదో ఒక లక్ష్యము కలిగి ఉంటుంది. ఉత్తమమైన జన్మను పొందిన మానవుడు దానిని సార్ధకమొందించుకునే ప్రక్రియలో భాగముగా తను నిర్దేశించుకొనిన జీవిత లక్ష్యము పట్ల పరిపూర్ణమైన అవగాహన మరియు ఆసక్తి కలిగియుండుట అనునది ప్రాథమిక ఆవశ్యకత.

లక్ష్యము లేక గమ్యమును నిర్ధారించుకొనుటతోనే మన పని ముగియదు. లక్ష్యమును కలిగియుండుట ఎంత అవసరమో, అచ్చటికి మనను చేర్చగల సమర్థవంతమైన మార్గమును, గురువును ఎంచుకొనుట కూడా అంతే ముఖ్యము. గమ్యము లేని జీవితము ఎటువంటి ప్రయోజనకరమైనపని చేయలేదు. కావున ఈవిషయమై అవగాహనా లోపమున్నచో గమ్యమును చేరుట అంత సులభమైన విషయము కాదు. ఎటు తిరిగీ చేరవలసినది గమ్యము. కావున గుర్తెరిగి చేయు ప్రయత్నము వలన త్వరిత గతిన గమ్యమును చేరుకొనగలము. రామేశ్వరము పోవలెనన్న ఢిల్లీ వైపునకు పోవు బండి ఎక్కినచో ప్రయోజనము లేదు. అది మనలను గమ్యమునకు చేర్చలేదు.

దానిని నిందించిన అది వృధాప్రయాసే. పోనీలే ఈ ప్రదేశము కూడా బాగానే ఉంది అని సంతృప్తి చెంది అక్కడే ఆగిపోయినచో మనయొక్క గమ్యమునకు దూరము కాక తప్పదు. మన యొక్క ఈ ఏమరపాటు వలన శ్రమ మరియు కాలయాపన తప్పవు. ఎవరో చెప్పారనో లేక ఒకరి మెప్పు కోసమో ఏ పనినీ మనము ఎక్కువ కాలము చేయలేము. ఎంతో మంది ఒకానొక పద్ధతి ఆచరించుచున్నారనో లేక ఏదో ఒకటిలే అని త్వరపడి ఎంచుకొనిన ఆ మార్గము మనకూ అనుకూలమైనదే అని నిర్ణయించలేము. మనము ఎంచుకొనిన మార్గము మనకు సంతృప్తికరముగా ఉండాలి. సూక్ష్మ మైన భగవత్‌తత్వము పొందుటకు మన మాచరించు పద్ధతి కూడా సూక్ష్మముగా, సులభముగా ఉండి మనలోని భగవదాపేక్షా పరమైన తపనను తీర్చునటువంటిదై ఉండాలి. దీనికి గాను నిష్కపటముగా ఉండాల్సిన అవసరము ఎంతైనా ఉంది. ఏ మార్గమును ఎంచుకొనినప్పటికీ అందు రెండు ప్రమాణములను ముఖ్యముగా మనము గమనించుకోవాలి. వాటిని కొలమానముగా భావించాలి.

1. మనము ఎంచుకొనిన మార్గమునందలి పద్ధతులను ఆచరించుట ద్వారా మన స్వీయ అనుభవము, మనలో కలుగు మార్పులు.
2. మనలోని తపనకు అది స్పందించుచున్నదా లేదా?

మన మనస్సు యొక్క సూచన మేరకు ధృఢమైన నిర్ణయము తీసుకోవాలి. దానికి తగినంత

ధైర్యము కావాలి. ధీరుడైన వాడే లక్ష్యమును సాధించగలడు. ఒక్కోసారి మనము ఎంత దీక్ష, పట్టుదల కలిగి యున్నప్పటికీ మన కర్మ సంస్కారముల ప్రభావముచే ఏమార్గమందైనను కొంతమేరకే మనకై మనము పురోగతి సాధించగలము. అటు పిమ్మట అది కొంత కష్టసాధ్య మైన విషయమే. కావున ఆధ్యాత్మిక మార్గమున పురోగమించవలెననిన గురువు యొక్క సహాయము మిక్కిలి ప్రధానమైనది. గురువు-మార్గము ఈ రెండు అంశములు సాధకులకు తమ సాధనలో చాలా కీలకమైన పాత్ర వహిస్తాయి. ఇతరులకు ఇవి రెండూ వేరు అంశములుగా అనిపించినా సాధకునికి మాత్రము ఈ రెండూ మిళితమై ఒక్కటిగా భావిస్తాడు. మనకు లభించిన గురువు వ్యక్తిగా కాక ఒక చైతన్య స్వరూపము కానిచో వారి సహాయమును సదా పొందలేము. ఎందుకంటే భౌతికపరమైనచో ఆ సహాయము కొంతమేరకే పరిమితమై ఉంటుంది. చైతన్యము అనునది నిరంతరము ఉండునటువంటిది.

పూజ్య గురుదేవులు శ్రీ రామచంద్రజీ మహారాజ్ గారు సవరించబడిన రాజయోగ సాధనాపద్ధతిని మానవాళి యొక్క ఆధ్యాత్మిక అభ్యున్నతిపై తపన చెంది అపార కృపతో ప్రసాదించినారు. గృహస్థుడు తన ధర్మము నెరవేర్చుచూ ఆధ్యాత్మికముగా పురోగమించుటకు ఇది మిక్కిలి అనుకూలమైనది. ప్రాణాహుతి సహిత ధ్యాన పద్ధతిన సాధన చేయు సాధకునికి గురువు-మార్గము వేరుగా తోచదు. ఇందు వారు సూచించిన పద్ధతులపైనే మన మనస్సు కేంద్రీకరించబడుతుంది. వారి సిద్ధాంతములలోనే వారి చైతన్యము ప్రతిబింబించును కాని వారి వ్యక్తి రూపము పైకి మన దృష్టి మరలదు. అంతగా వారియొక్క భౌతిక పరమైన ఉనికి శూన్యము కాబడినది. వారిది ఒక విశిష్టమూర్తిత్వము.

ఆధ్యాత్మిక మార్గమున ఉన్నత స్థితులకు చేరుకొనవలెనన్న లేక స్థిరముగా ఉండవలెనన్న సమర్థ గురువర్యులు పూజ్య శ్రీ రామచంద్రజీ మహారాజ్‌గారి సహాయము పొందుట ద్వారా మార్గము సులభతరము కాబడుతుంది. గురువుగారి సహాయము ప్రాణాహుతి రూపమున మన సాధనకు జోడై మనలో అనేక మార్పులకు కారకమౌతుంది. మన సాధనలోని అనుభవాలే మనకు కొలమానమౌతాయి. దీని ప్రభావమున సాధనలో ఒక స్థిరత్వము కలుగుతుంది. ధ్యాన ప్రక్రియ ద్వారా సంకల్పము బలపడుతుంది. ఎంతో శ్రమించినను సాధ్యముకాని అనేక స్థితిగతులను గురువుగారి యొక్క ప్రేమ ప్రాణాహుతి రూపమున మనపాలిట వరమై సులభసాధ్యము కావించుచున్నది. అట్టి గురువర్యులను పొందిన మనము ధన్యులము. వారి పట్ల విశ్వాసము కలిగియుండుట మనయొక్క కర్తవ్యమేకాదు, కనీస ధర్మము కూడా. గురువు గారి సహాయముచే మన అనుభవాల ఫలితముగా మనలో గురువుగారి పట్ల అంకురమైన విశ్వాసము అనేక మార్పులు చెంది సూక్ష్మతను సంతరించుకుంటుంది. అంటే విశ్వాసము ఉంటుంది కాని దాని యొక్క

ఎరుక కలిగి ఉండము.

విశ్వాసము ఉన్నచోట ప్రేమకూడా ఉంటుంది. ప్రత్యేకంగా వారంటే నాకు అమితమైన ప్రేమ ఉంది అంటాము. అంటే వారికి సంబంధించిన ప్రతియొక్క విషయము పట్ల మనకు ఇష్టత, ఆసక్తి సహజముగా కలిగి ఉంటారు. ఈ సంస్థలో సాధకులు గురువుగారి యొక్క చైతన్యమునకు అనగా వారియొక్క సిద్ధాంతములకు ఇష్టతతో కట్టుబడి ఉంటారు. సాధనచే మనలో గురువుగారి పట్ల స్థిరమైన విశ్వాసము, ప్రేమ మరియు భక్తి అభివృద్ధి చెందుచూ మరింతగా వారి కృపకు పాత్రులను చేస్తుంది. మనకు కలుగు ప్రతి అనుభవము కూడా మనకు దానిని ప్రసాదించిన గురువర్యులపై విశ్వాసము పెంపొందించుకొనుటకు దోహదపడుతుంది. గురువుగారి కృప తుదివరకూ కూడా మన వెన్నంటే ఉంటుంది. దాని ప్రభావముచే ఎటువంటి సంశయమునకు తావులేక సానుకూల దృక్పథముతో ధైర్యముగా ముందుకు సాగిపోతూ ఉంటాము. నిర్భయముగా ఉండటమేకాదు. ఎల్లవేళలా అభయము పొందుతూ ఉన్నట్లుగా ఉంటాము. స్థిరముగా గమ్యముపై దృష్టి కేంద్రీకరించి ఉంటాము. దానికి అనుకూలమైన వనరులను సమకూర్చుకుంటాము.

అనంతమైన ఆధ్యాత్మిక జీవనమునకు విశ్వాసము పునాది వంటిది. సాధనపరముగా ఇది ఒకే అంశమునకు సంబంధించినదిగా ఉండదు. అనేక రూపాలలో ఇది మనలో ప్రకటితమౌతూ ఉంటుంది. ఉదాహరణకు ఇది

1. సమర్థ గురువర్యుల పట్ల విశ్వాసము
2. వారు ప్రసాదించిన మార్గముపై విశ్వాసము
3. మన మెంచుకొనిన మార్గముపై విశ్వాసము
4. మన ప్రశిక్షకునిపై విశ్వాసము
5. మనపై మనకు విశ్వాసము

దృఢమైన విశ్వాసము యొక్క ప్రభావముచే మనలో అంతర్గతముగా ఒకవిధమైన శక్తి పెంపొంది సాధనకు ప్రతికూలమైన వాటిని పటాపంచలు కావించుటకు దోహదపడుతుంది.

విశ్వాసము అను విషయమునకు కొందరు విపరీతార్థాలు ఇస్తూ ఉంటారు. కృషి చేయకనే ఫలితాన్ని ఆశిస్తూ ఉంటారు. ఉదాహరణకు గాలిలో దీపముంచి భగవంతుడా అంతా నీదే భారము అనునది అంధవిశ్వాసము లేక గుడ్డి నమ్మకము. ఒకరకముగా చూస్తే సాధనలో అదీ అవసరమే కానీ విపరీతము కాకూడదు. కొన్ని సందర్భాలలో అర్థరహితముగా కూడా ఉంటుంది. మనవంతు కృషి మనము చేసి దాని ఫలితము గురువుపై వదిలివేయవలెను. వారు మనకు అందించినదే మనకు సరియైనది అనెడి భావనతో ఉండుట నిజమైన విశ్వాసము. ఈ వివేకము మనలో లోపించినచో మానసిక సంఘర్షణకు లోనుకాక తప్పదు.

ప్రార్థనలో మనయొక్క గమ్యము దానిని చేరుకొనుటకు మనయొక్క నిస్సహాయత మరియు గురువే మనలను అచ్చటికి తీసుకు పోగల సమర్థుడు అనే విశ్వాసముతో సాధన చేస్తాము. ధ్యానములో మనయొక్క నిజస్థితి (సమత్వత) మనకు పదేపదే ఎరుకకు వస్తుంది. దానివలన మరింతగా మనలో విశ్వాసము దృఢపడుతూ ఉంటుంది.

గురువుగారు మాధ్యమముగా సంపూర్ణమైన విశ్వాసము అనునది శాశ్వతము - అశాశ్వతము, నిత్యము - అనిత్యము అను స్థితుల మధ్య జీవన సంధానము ఏర్పరచు ఒక వారధి వంటిది. విశ్వాసము అనే పునాదిపై ఏర్పడిన బంధము శాశ్వతత్వము కలిగి ఉంటుంది. జడత్వములో ఒకే స్థితిలో నిలిచిపోకుండా గమ్యము చేరువరకు అది మనకు సహాయకారిగా సాధనలో తోడ్పడుతూ ఉంటుంది. భగవంతుడు (శాశ్వతుడు) మానవుని (అశాశ్వతుడు) ద్వారా తనని తాను అర్థవంతముగా ప్రకటించుకొనినాడు. God is immortal but finds His meaningful expression through mortals.

శ్రద్ధ అనునది సాధన చతుష్టయములలో మూడవదైన షట్ సంపత్తులలో ఐదవ అంశముగా ప్రస్తావించబడి యున్నది. మన సంస్థయందు మన సాధన మొదటిదైన వివేకము, వైరాగ్యముతో కాక మూడవదైన షట్సంపత్తితో సాధన ఆరంభిస్తాము. వివేక వైరాగ్యములు ముందుగా అలవరచుకోము. సాధనలో అవి అలవడతాయి. మనము మొదటిగా 1) శమము 2) దమము 3) ఉపరతి 4) తితీక్ష 5) శ్రద్ధ (faith) 6) సమాధాన్ అను స్థితుల గుండా పురోగమించుచూ సాధన చతుష్టయములలో నాల్గవదైన ముముక్షత్వమును పొందగలుగుతాము.

మన సాధనలో భాగముగా గురువుగారు సులభముగా మార్గమును సూచించి ఉన్నారు. సాధన మొదటి దశలలోనే "ఎ' మరియు "బి' బిందువులపై ధ్యానము కొనసాగించుట ద్వారా శమ-దమ స్థితులు మన అనుభవానికి వస్తాయి. ప్రార్థన, ధ్యానము, క్షాళన వీటికి మరింతగా దోహదపడి మనలోని దైవత్వము వికాసముచెందుటకు అనుకూలిస్తాయి.

మనము మనయొక్క నిజస్థితిని ఎంతమేరకు స్వంతము చేసుకొంటామో అంతమేరకు మనలో దైవత్వము వికాసము చెందుతూ ఉంటుంది. అంతేకాక దానికి కారకులైన గురువుగారిపై కూడా విశ్వాసము బలపడుతూ ఉంటుంది. తద్వారా వికసించు జ్ఞానము మనలోని ధైర్యాన్ని పెంచుతుంది. కావున విశ్వాసము అనునది బహిర్గతముగా వచ్చునది కాదు. అంతరాళములో

ఇది ఉద్భవించి వికసించును. ఎందుకనిన గురువుగారి యొక్క శక్తి అదృశ్యముగా ఉండి మనలను ముందుకు నడిపిస్తుంది. దశాదేశములను మన జీవనశైలిగా మలచుకుంటాము. మన సంస్కార ప్రభావమున అప్పుడప్పుడు మనలో విశ్వాసము అనునది లోపించింది అని భావిస్తాము. నిజానికి అది మనపై మనకే విశ్వాసము లోపించుటే కానీ గురువుగారిపైన లేక పద్ధతిపైన మాత్రము ఎప్పటికీ కాదు. ఎందుకంటే అది ఈ సంస్థలో మన గురువుగారు మనకిచ్చిన అభయము అని చెప్పుకొనవచ్చును. గురుకృపతో మనలను సంధానము కావించిన పిమ్మట అది ఎప్పటికీ మనలను విడనాడదు. తుదివరకు ఆ బంధము అనేది దృఢపడుతూ ఉంటుంది. పరిపక్వము చెంది విశ్వాసము శ్రద్ధగా పరిణామము చెందుతూ ఉంటుంది. శ్రద్ధ దృఢముగా పాదుకొనినచో ఎవ్వరూ క్షణమైనను దానినుండి దూరము కాలేరు. ఇది చాల ఉన్నతమైన స్థితి.

పూజ్య శ్రీ రామచంద్రజీ గారి కృపకు పాత్రులమైన మనమందరము మనకు ఇవ్వబడిన ఆ బంధమును సాధనచే దృఢముగా పెంపొందించుకొను ప్రయత్నము చేయుచూ గురువుగారిపైన నిరంతరము శ్రద్ధను పెంపొందించుకొనగలమని ప్రార్థన.

* * *

మా గురువర్యులు యిట్లనెడివారు. "ఓర్పు, సహనమునకు మన గృహమే శిక్షణా రంగము. గృహస్థజీవనములోని యొడిదుడుకులను ప్రశాంతముగా సహించుటే మహోన్నతమగు తపస్సు. అది మిగిలిన తపశ్చర్యలన్నిటికంటే ఉత్తమమైనది. కావున, ఈ పరిస్థితులలో మనము చేయవలసినదేమనగా కోప దుఃఖ భావములకు లొంగక తప్పు మనయందేయున్నదని భావించి, ప్రశాంత చిత్తముతో వాటిని భరించవలెననెడి వినమ్రవైఖరిని పూనుటయే." (Basic Writings of Sri Ramchandra, page 199)

- పూజ్య బాబూజీ మహారాజ్